శ్రీకృష్ణ అవతారంలో దర్శనమిచ్చిన రామయ్య

కృష్ణావతారంలో..

పర్ణశాల, డిసెంబర్ 21 : ముక్కోటి ఉత్సవాల్లో భాగంగా ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల దేవాలయంలో గురువారం శ్రీకృష్ణ అవతారంలో పర్ణశాల రామయ్య భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు ఈ అవతారం గురించి భక్తులకు వివరించారు. కార్యక్రమంలో అర్చకులు శేష కిరణ్‌కుమారాచార్యులు, అమరవాది కిశోరాచార్యులు, భరద్వాజాచార్యులు, రాజగోపాలాచార్యులు, నరసింహాచార్యులు, ఏఈవో శ్రావణ్‌కుమార్, అనిల్, సూపరింటెండెంట్ కిశోర్, గుమస్తా ప్రసాద్, సిబ్బంది రాము, శివ, భక్తులు పాల్గొన్నారు.

త్వరలో కామన్ సర్వీస్ సెంటర్లుగా పీఏసీఎస్‌లు: డీసీసీబీ

మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం

ఖమ్మం వ్యవసాయం, డిసెంబర్ 21: భారత ప్రభుత్వ సహకార శాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (పీఏసీఎస్)ను కామన్ సర్వీస్ సెంటర్లు (సీఎస్‌సీ)గా మార్చులు చేయనున్నట్లు డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం తెలిపారు. నగరంలోని డీసీసీబీ సమావేశ మందిరంలో గురువారం జరిగిన పీఏసీఎస్ సెక్రటరీలకు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సొసైటీల్లో కొద్దిరోజుల్లోనే ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. తద్వారా 300 రకాల ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. గ్రామీణ ప్రజలకు ఇక నుంచి ఆధార్, పాన్‌కార్డు, రైల్వేటికెట్, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, హెల్త్ సర్వీసులు అందుబాటులో ఉంటాయని వివరించారు. దీంతో గ్రామీణ ప్రాంత ప్రజలకు సమయం ఆదా కావడంతోపాటు ఆర్థిక బారం కూడా తగ్గుతుందని అన్నారు. డీసీవో విజయకుమారి, డీసీసీబీ సీఈవో అబ్దుల్ ఉర్ రెహమాన్, జీఎంలు నర్మద, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

కిట్టయ్యగా రామయ్య

కృష్ణావతారంలో ఉన్న రామయ్యకు పూజలు చేస్తున్న అర్చకుడు

వేడుకలను తిలకిస్తున్న భక్తులు

- స్వామివారిని చూసి మురిసిన భక్తజనం
- నేత్రపర్వంగా తిరువీథి సేవ
- నేటితో ముగియనున్న పగల్ పత్తు ఉత్సవాలు

భద్రాచలం, డిసెంబర్ 21 : భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ముక్కోటి అధ్యయనోత్సవాల్లో భాగంగా స్వామివారు గురువారం శ్రీకృష్ణావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, ఆరాధన, అరగింపు, సేవాకాలం నిర్వహించారు. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఆండాళ్ అమ్మవారిని, శ్రీకృష్ణ పరమాత్మను వేంచేపు చేసి తిరుప్పావైలోని 30 పాశురాలను పఠించారు. తర్వాత స్వామివారి ఉత్సవమూర్తులు, నిత్య కల్యాణమూర్తులను బేడా మండపానికి తీసుకొచ్చి అభిషేక తిరుమంజనం చేశారు. 12 మంది ఆళ్వార్లను వేంచేపు చేసి ముందుగా విశ్వక్సేన ఆరాధన, కర్మణః పుణ్యాహవాచన చేసి హారతులు సమర్పించారు. అంతరాలయంలోకి స్వామివారిని తీసుకెళ్లి శ్రీకృష్ణుడిగా అలంకరించారు. ఒకచేతిలో వెన్న ముద్ద, మరో చేతిలో వేణువును ఉంచి సర్వాంగ సుందరంగా అలంకరించి.. బేడా మండపానికి తీసుకొచ్చి ప్రత్యేక వేదికపై వేంచేపు చేశారు. సాక్షాత్తు శ్రీరామచంద్రుడే శ్రీకృష్ణావతారంలో దర్శనమివ్వడంతో స్వామివారిని చూసి భక్తులు మురిసిపోయారు. ఆ తరువాత స్వామివారిని అంతరాలయంలోకి తీసుకెళ్లి రాజభోగం సమర్పించారు. మధ్యాహ్నం 2 గంటలకు స్వామివారిని బేడా మండపానికి తీసుకొచ్చి బంగారు ఊయలలో వేంచేపు చేసి 'లాలలు-జోలలు' అనే వేడుకలను వైభవంగా చేపట్టారు. మధ్యాహ్నం 3 గంటలకు స్వామివారిని సమస్త మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్చారణలు, కోలాట నృత్యాల నడుమ అంగరంగ వైభవంగా మిథిలా స్టేడియానికి తీసుకొచ్చి ప్రత్యేక వేదికపై ఆసీనులను చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కిట్టయ్యగా దర్శనమిస్తున్న రామయ్యను చూసేందుకు భక్తులు సుదూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలి రావడంతో మిథిలా ప్రాంగణం భక్తాద్రిగా మారింది. 'జై శ్రీరామ్, జైజై శ్రీరామ్..' అంటూ భక్తులు జయజయ ధ్వానాలు చేశారు. వచ్చిన భక్తులందరికి అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం 4 గంటలకు స్వామివారికి తాతగుడి సెంటర్ వరకు తిరువీధి సేవ నిర్వహించారు. తమ ఇష్టదైవాన్ని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఫల, పుష్పాదులు, హారతులు సమర్పించి పులకించిపోయారు.

ఆన్‌లైన్ ద్వారా టికెట్లు, వసతి గదులు

భద్రాచలం, డిసెంబర్ 21 : ముక్కోటి ఏకాదశి అధ్యయనోత్సవాలకు విచ్చేసే భక్తులు బస చేయడానికి ఆన్‌లైన్ ద్వారా ద్వార దర్శనం టికెట్లు, గదులను బుక్ చేసుకోవాలని ఆర్డీవో మాలోతు మంగీలాల్ ఒక ప్రకటనలో తెలిపారు. టికెట్ల కోసం https:// bhadradritemple. telangana.gov. in వెబ్‌సైట్‌లో బుక్ చేసుకోవాలని, వసతి కోసం https:// book. bhadrachalam onl ine.com/ వెబ్‌సైట్‌ను సందర్శించాలని, భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేటితో ముగియనున్న పగల్ పత్తు ఉత్సవాలు

ఏకాదశి అధ్యయనోత్సవాల్లో భాగంగా ఏకాదశికి ముందు పది రోజులు పగల్ పత్తు ఉత్సవాలు, తర్వాత పది రోజులు రాపత్తు ఉత్సవాలు నిర్వహిస్తారు. శుక్రవారం పది రోజులు పూర్తవుతున్న నేపథ్యంలో పగల్ పత్తు ఉత్సవాలు ముగుస్తాయి. శనివారం ఉదయం స్వామివారు వైకుంఠ ద్వారంలో భక్తులకు దర్శనమిస్తారు. అదేరోజు సాయంత్రం డీఎస్పీ బంగళాలో రాపత్తు ఉత్సవాలను ప్రారంభిస్తారు.

మరోసారి మహమ్మారి

- విస్తరిస్తున్న కొవిడ్ కొత్త వేరియంట్
- ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఒక కేసు నమోదు
- ఊపిరితిత్తులపై ప్రభావ మంటున్న వైద్యులు
- అప్రమత్తంగా ఉండాలంటూ సూచనలు
- ఐసోలేషన్ కేంద్రాల ఏర్పాట్లపై దృష్టి

భద్రాద్రి కొత్తగూడెం, నమస్తే తెలంగాణ/ అశ్వారావుపేట, డిసెంబర్ 21: కరోనా మహమ్మారి కొత్త వేరియంట్‌లో మరోసారి విస్తరిస్తోంది. ఇప్పటికే ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఒక కేసు కూడా నమోదైంది. దీంతో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. జాగ్రత్తగా ఉండాలంటూ ప్రజలకు సూచిస్తున్నారు. ఈ కొత్త వేరియంట్ ప్రభావం ఊపిరితిత్తులపై అధికంగా ఉంటుందంటూ చెబుతున్నారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ఆదేశాలతో జిల్లా వైద్యాధికారులు ఐసోలేషన్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. చికిత్సకు అవసరమైన మందులు, ఇంజక్షన్లను ఆసుపత్రుల్లో అందుబాటులో ఉంచేలా చర్యలు చేపడుతున్నారు. కరోనా అంటేనే ప్రజలు హడలిపోతున్నారు. 2020, 2021 సంవత్సరాల్లో కరోనా మరణ మృదంగం మోగించినప్పుడు బెంబేలెత్తిన జిల్లా ప్రజలు ఈ కొత్త వేరియంట్ విస్తరణ గురించే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోపది రోజుల్లో ఏడాది ముగింపు వేడుకలు, ఆ వెంటనే సంక్రాంతి పండుగ ఉత్సవాలు ఉండడంతో ప్రజలు సమూహంగా ఏర్పడకుండా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. అలాగే, మాస్క్ ధరించడంతోపాటు మరింత పరిశుభ్రతను పాటించాలంటూ, నిత్యం శానిటేషన్ చేసుకుకోవాలంటూ జాగ్రత్తలు చెబుతున్నారు.

వైద్యారోగ్య శాఖ సన్నద్ధం..

ఒకవేళ కొవిడ్ విస్తరించినా దానిని ఎదుర్కొనేందుకు ఉమ్మడి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు సన్నద్ధమవుతున్నారు. కొన్ని రోజుల క్రితం దేశంలోకి ప్రవేశించిన ఈ కొత్త వేరియంట్ తెలంగాణలోకీ వ్యాపించింది. సుమారు 14 వరకు కేసులు నమోదయ్యాయి. ఇవన్నీ హైదరాబాద్‌లోనే నమోదయ్యాయి. కానీ క్రమంగా జిల్లాలకూ విస్తరిస్తున్నాయి. కరీంనగర్, ఉమ్మడి ఖమ్మం జిల్లాలకు కూడా విస్తరించడంతో జిల్లా వైద్యాధికారులు మరింత అప్రమత్తమయ్యారు. రెండు రోజుల క్రితం ఖమ్మంలోని ప్రైవేట్ ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చిన 55 ఏళ్ల వ్యక్తికి కరోనా పాజిటివ్ రావటంతో వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు ఉలిక్కిపడ్డారు. కొత్త వేరియంట్ కట్టడి కోసం ముందస్తుగా పటిష్ట చర్యలు చేపడుతున్నారు.

ఊపిరితిత్తులపై ప్రభావం..

ఈ వైరస్ ప్రభావం ఊపిరితిత్తులపై ఎక్కువగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. ఈ వేరియంట్ శరీరంలోకి ప్రవేశిస్తే జ్వరం, దగ్గు, జలుబు, గొంతునొప్పి, తలనొప్పి వంటి లక్షణాలు ఉంటాయని అంటున్నారు. రోగనిరోధక శక్తి తగ్గడంతో ఊపిరితిత్తులు ఇన్‌ఫెక్షన్‌కు గురయ్యే ప్రమాదం ఉంటుందని హెచ్చరిస్తున్నారు. ఈ వైరస్ గాలి ద్వారా ఒకరి నుంచి మరొకరికి సోకే ప్రమాదం ఉన్నందున ప్రజలు సమూహంగా ఉండకూడదంటూ సూచిస్తున్నారు.

ఐసోలేషన్ కేంద్రాల ఏర్పాటు..

ఒకవేళ కొత్త వేరియంట్ విస్తరించినా ఎదుర్కొనేందుకు వీలుగా వైద్యాధికారులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే జిల్లా దవాఖానాలు, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో ఐసోలేషన్ కేంద్రాలను, అదనపు బెడ్లను ఏర్పాటు చేస్తున్నారు. అవసరమైన ఆర్‌టీపీసీఆర్ కిట్లు, వెంటిలేటర్లు, మాస్కులు, ఆక్సిజన్ సిలిండర్లు, మందులు, ఇంజక్షన్లు సిద్ధం చేసుకుంటున్నారు. లక్షణాలు ఎక్కడైనా ఉంటే వెంటనే నమూనాలు సేకరించి పరీక్షించేలా సన్నద్ధమవుతున్నారు.

ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నాం..

కరోనా కొత్త వేరియంట్ విస్తరిస్తున్నట్లు ఇప్పటికే సమాచారం ఉంది. కానీ జిల్లాలో ప్రస్తుతం కేసులేమీ నమోదు కాలేదు. కానీ ముందస్తు చర్యల్లో భాగంగా వార్డులను సిద్ధం చేస్తున్నాం. అన్ని పీహెచ్‌సీల్లోనూ మందులు రెడీ చేశాం. దగ్గు, జ్వరం వచ్చాక కరోనా లక్షణాలు ఉన్నట్లు అనుమానం కలిగితే వెంటనే పరీక్షలు చేస్తాం. ఒకవేళ ఆ పరీక్షల నిర్ధారణ అయితే ఐసోలేట్ చేస్తాం. ఇందుకోసం కొత్తగూడెంలో 60, భద్రాచలంలో 30 ఆక్సిజన్ బెడ్లను కూడా సిద్ధంగా ఉంచారు. మిగతా ఆసుపత్రుల్లో కూడా బెడ్లను సిద్ధం చేశాం.

–డాక్టర్ శిలిష, డీఎంహెచ్‌వో, భద్రాద్రి కొత్తగూడెం

ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలి..

కరోనా కొత్త వేరియంట్ విస్తరిస్తున్న నేపథ్యంలో ప్రజలు కూడా చాలా అప్రమత్తంగా ఉండాలి. ఎప్పటికప్పుడు శానిటేషన్ చేసుకుంటూ ఉండాలి. మాస్కులు ధరించాలి. రద్దీ ప్రాంతాలకు వెళ్లొద్దు. బలవర్ధమైన ఆహారం తీసుకొని ఇమ్యూనిటీ స్థాయి పెంచుకోవాలి. తద్వారా మనల్ని మనం రక్షించుకోవచ్చు. కరోనా నుంచి రక్షణ పొందొచ్చు. ఏవైనా కరోనా లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించి తగు చికిత్స తీసుకోవాలి.

–డాక్టర్ విజయ్‌కుమార్, అత్యవసర వైద్యనిపుణుడు, అశ్వారావుపేట

భద్రాద్రి రామయ్య తెప్పోత్సవానికి పకడ్బందీగా ఏర్పాట్లు

ఏర్పాట్ల పరిశీలనలో భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక అల

ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రియాంక అల

భద్రాచలం, డిసెంబర్ 21: భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ సన్నిధిలో ముక్కోటి వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయని, ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం గోదావరి తీరంలో జరుగనున్న స్వామివారి తెప్పోత్సవానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక అల తెలిపారు. గురువారం ఆమె భద్రాచలం పట్టణానికి విచ్చేసి రామయ్య జల విహారానికి జరుగుతున్న ఏర్పాట్లను ఆలయ అధికారులతో కలిసి పరిశీలించారు. తొలుత శనివారం జరుగనున్న ఉత్తర ద్వార దర్శన ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు సూచనలిచ్చారు. అనంతరం గోదావరిలో హంస వాహన ట్రయల్ రన్‌ను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేయాలన్నారు. గోదావరిలో భక్తులు స్నానమాచరించేందుకు తగిన సౌకర్యాలు కల్పించాలన్నారు. హంస వాహనానికి ముందూ వెనక రెండు పైలెట్ నాటు పడవలు నడిచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఉత్సవాలు ముగిసే వరకు తీరంలో 40 మంది గజ ఈతగాళ్లు, 20 నాటు పడవలు అందుబాటులో ఉంచాలన్నారు. ఉత్తర ద్వార దర్శనం వీక్షించేందుకు వచ్చే భక్తులు తమకు కేటాయించిన సెక్టార్లకు వెళ్లి టికెట్ చూపించాల్సి ఉంటుందన్నారు. వాహనాల పార్కింగ్‌కు ఆర్‌అండ్‌బీ కార్యాలయం, బ్రిడ్జి పక్కన, జూనియర్ కళాశాల క్రీడా మైదానం, మార్కెట్ యార్డు స్థలాలను కేటాయించామన్నారు. భక్తులకు సమాచారం అందించేందుకు కొత్తగూడెం బస్టాండు, రైల్వే స్టేషన్, భద్రాచలం బ్రిడ్జి పాయింట్, బస్టాండ్, స్నాన ఘట్టాలు, విస్తా కాంప్లెక్స్, కూనవరం రోడ్, మార్కెట్ యార్డు, చర్ల రోడ్డులో సమాచార కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. అత్యవసర వైద్య సేవల కోసం ఏరియా ఆసుపత్రిలో 10 బెడ్లు అందుబాటులో ఉంచాలని వైద్యాధికారులను ఆదేశించారు. శుక్ర, శనివారాల్లో భద్రాచలం పట్టణంలో మద్యం, మాంసాహార విక్రయాలు నిలిపివేయాలని ఎక్సైజ్‌శాఖ, సివిల్ సప్లయిస్ అధికారులను ఆదేశించారు. పర్యటనలో అదనపు కలెక్టర్ రాంబాబు, డీఆర్డీవో మధుసూదనరాజు, ఏఎస్పీ పరితోశ్ పంకజ్, ఆర్డీవో మంగీలాల్, అన్ని శాఖల జిల్లా అధికారులు ఉన్నారు.

గోదావరిలో హంస వాహన ట్రయల్ రన్

తెప్పోత్సవం తిలకించడానికి సిద్ధంగా తీరం

ముక్కోటికి సిద్ధమైన పర్ణశాల

పర్ణశాల, డిసెంబర్ 21 : ముక్కోటి ఏకాదశి పర్వదినానికి పర్ణశాలలో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. శుక్రవారం తిరుమంగై ఆల్వార్ పరమపదోత్స

క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలి

గ్రీవెన్స్ డేలో సీపీ విష్ణు ఎస్ వారియర్

మాట్లాడుతున్న సీపీ విష్ణు ఎస్ వారియర్

మామిళ్లగూడెం, డిసెంబర్ 21 : వివిధ సమస్యలపై బాధితులు సమర్పించిన వినతులపై విచారణ చేసి.. వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా చట్టపరిధిలో పరిష్కరించాలని పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్ వారియర్ పోలీస్ అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోలీస్ కమీషనర్ కార్యాలయంలో గురువారం గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 20 మంది బాధితుల ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించిన పోలీస్ కమిషనర్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అధికంగా భూ వివాదాలు, కుటుంబ, వ్యక్తిగత సమస్యలతోపాటు ఆర్థిక లావాదేవీలు, భార్యాభర్తల సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను ఆయన పరిశీలించారు. ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో విచారణ చేసి.. చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

'సింగరేణి డే'ను విజయవంతం చేయండి

పోస్టర్ ఆవిష్కరణలో జీఎంలు

కొత్తగూడెం సింగరేణి, డిసెంబర్ 21: కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో ఈనెల 23న జరిగే సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని సంస్థ జీఎం పర్సనల్ బసవయ్య పిలుపునిచ్చారు. జిల్లాకేంద్రంలోని హెడ్డాఫీస్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో జీఎం సెక్యూరిటీ బీఆర్ దీక్షితులు, జీఎం ఈఈ కవితానాయుడు, ఏజీఎం పర్సనల్ కె.శ్రీనివాసరావు, డీవైపీఎం సుశీల్, సీనియర్ పీవోలు టి.శ్రీనివాసరావు, జీకే కిరణ్‌కుమార్, వెల్ఫేర్ పీఏ కె.వరప్రసాదరావు, స్పోర్ట్స్ సూపర్‌వైజర్లు, సేవా కో-ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

చిన్న పరిశ్రమలను కాపాడాలి

- మూతపడిన వాటిని పునరుద్ధరించాలి
- పార్లమెంటు సమావేశాల్లో ఖమ్మం ఎంపీ నామా

మాట్లాడుతున్న ఎంపీ నామా నాగేశ్వరరావు

ఖమ్మం, డిసెంబర్ 21: రాష్ట్రాల్లో చిన్న పరిశ్రమలను కాపాడాలని బీఆర్ఎస్ లోక్‌సభా పక్ష నేత, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు కోరారు. ఇప్పటికే మూతపడిన వాటిని పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. గడిచిన ఐదేళ్లలో పలు రాష్ట్రాల్లోని కొన్ని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు వివిధ కారణాలతో మూతపడిన అంశంపై గురువారం ఆయన పార్లమెంటులో మాట్లాడారు. దేశంలో ఇంత పెద్ద సంఖ్యలో ఇన్ని పరిశ్రమలు ఎందుకు మూతపడ్డాయో ప్రధాన కారణాలను చెప్పాలని డిమాండ్ చేశారు. ఇలా పరిశ్రమలు మూతపడడం వల్ల ఉపాధి అవకాశాలు దెబ్బతిని నిరుద్యోగిత మరింత పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని మూతపడిన పరిశ్రమలను తిరిగి పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి భాను ప్రతాప్ సింగ్ వర్మ సమాధానమిస్తూ.. గడిచిన ఐదేళ్లలో 32,754 మంది తమ వ్యాపారాలను రద్దు చేసుకోగా.. ఈ ఐదేళ్ల కాలంలో ఈ నెల 15 వరకు రిజిస్ట్రేషన్ పోర్టల్ ద్వారా 1,21,11,249 మంది కొత్తగా వ్యాపారాల కోసం పేర్లు నమోదు చేసుకున్నారని చెప్పారు. చిన్న వ్యాపారుల కోసం కేంద్ర ప్రభుత్వం అనేక ప్రోత్సాహాలను అందిస్తోందని, వ్యాపారాభివృద్ధికి సహకరిస్తోందని అన్నారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలి

ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా యంత్రాంగం పనిచేయాలి
ప్రాజెక్టుల కోసం భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి
డొంకల్లోని ఆక్రమణలను తొలగించి రహదారులు నిర్మించాలి
అధికారుల సమీక్ష సమావేశంలో ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్

మాట్లాడుతున్న ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్

ఖమ్మం, డిసెంబర్ 21: రెవిన్యూ సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్ ఆదేశించారు. యంత్రాంగమంతా ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు. ధరణి, రిజిస్ట్రేషన్లు, భూసేకరణ, బల్క్ సమస్యలు తదితర అంశాలపై రెవెన్యూ అధికారులతో నూతన కలెక్టరేట్‌లో గురువారం ఏర్పాటుచేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. రెవెన్యూ సంబంధ దరఖాస్తులపై వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు. ధరణి, టీఎం-33 ద్వారా వచ్చిన దరఖాస్తుల్లో పెండింగ్ ఉన్న వాటిని యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని సూచించారు. జీఎల్ఎం సర్వేషన్, మ్యుటేషన్ల దరఖాస్తుల ఫైళ్లు వెంటనే సమర్పించాలన్నారు. ఫైళ్లను సంబంధిత తహసీల్దార్ కార్యాలయాల్లో భద్రపరచాలన్నారు. జిల్లాలో వివిధ ప్రాజెక్టుల కోసం చేపడుతున్న భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. పోస్ట్ అవార్డ్ పనులపై చర్యలు తీసుకోవాలని అన్నారు. స్ట్రక్చర్లకు చెల్లింపులు పెండింగ్‌లో లేకుండా చూడాలన్నారు. రిజిస్ట్రేషన్ల స్లాట్లు పెండింగ్ లేకుండా చూడాలన్నారు. దరఖాస్తుదారులకు సమయమిచ్చి దరఖాస్తులను పరిష్కరించాలన్నారు. గుర్తించిన బల్క్ సమస్యలకు సంబంధించి చర్యలు వేగవంతం చేయాలన్నారు. సర్వే, విచారణలు త్వరితగతిన పూర్తి చేసి అర్హులకు పట్టాల జారీకి చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, భవనాలకు స్థల సేకరణలు పూర్తి చేయాలన్నారు. వేర్ హౌజింగ్ గోడౌన్ల కోసం ఒక్కో డివిజన్‌లో 50 ఎకరాల చొప్పున భూసేకరణ చేయాలన్నారు. ఎంఎల్ఎస్ పాయింట్ల కోసం ప్రతి మండలంలో 2 ఎకరాల భూమిని గుర్తించి ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశించారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలపై తీసుకున్న చర్యల నివేదిక సమర్పించాలన్నారు. జీవో 59లో తిరస్కరణకు గురైన దరఖాస్తులకు సంబంధించి స్థలాలను స్వాధీనం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. మీ సేవ దరఖాస్తులను నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలన్నారు. ప్రజావాణి దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. జిల్లాలో 1209 డొంకలుండగా వాటిల్లో 69 డొంకలు ఆక్రమణకు గురైనట్లు చెప్పారు. వెంటనే సర్వే చేపట్టి, డొంకల్లో ఆక్రమణలు తొలగించి ఉపాధి హామీ కింద రహదారుల ఏర్పాటుచేసి రక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలన్నారు. చెక్కులు సిద్ధంగా ఉన్నచోట వెంటనే పంపిణీ చేయాలని ఆదేశించారు. కోర్టు కేసుల విషయంలో టైం బాండ్, డైరెక్షన్లపై వెంటనే చర్య లు తీసుకోవాలని అన్నారు. అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, శిక్షణ సహాయ కలెక్టర్ మయాంక్ సింగ్, ఇతర అధికారులు గణేశ్, అశోక్ చక్రవర్తి, శ్రీనివాసులు, అరుణ తదితరులు పాల్గొన్నారు.

సందడిగా యువజనోత్సవం

కొత్తగూడెం టౌన్, డిసెంబర్ 21: కొత్తగూడెం క్లబ్‌లో స్వామి వివేకానంద గురువారం సందడిగా యువజనోత్సవం జరిగింది. వేడుకలో సుమారు 450 మంది కళాకారులు నృత్యం, పాటలు, వ్యాస రచన, వక్తృత్వం, పెయింటింగ్, ఫొటోగ్రఫీ పోటీల్లో పాల్గొన్నారు. పోటీలను జిల్లా యువజన అధికారి పరంధామరెడ్డి ప్రారంభించారు.

క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న అధికారులు

కళాకారుల నృత్య ప్రదర్శన

పాల్గొన్న విద్యార్థులు